# 22. ఆపిల్స్ ఉంటే అన్న మెందుకు

ఏర్ కండిషన్డు ఇంట్లో కూర్చుని విసుగెత్తిన ఓ మంత్రి గారి సతీమణి ఓ సాయం సమయాన మలయ మారుతాల నాస్వాదిస్తూ బాల్కనీలో ముద్దుల కూతురితో ముచ్చట లాడుతూ కూర్చునుండగా—

సరిగ్గా అదే సమయాన ఆ వీధినే ఓ కరువు బాధితుల ఊరేగింపు ఆకలి కేకలు వేసుకుంటూ నీరసంగా సాగిపోయిందట.

ఆ ఊరేగింపునూ, అందులోని ఎండిన డొక్కల, ఎముకల గూళ్ళ గోచీపాత రాయుళ్ళనూ చూచి జడుసుకున్న సదరు మంత్రికుమారి తల్లిని అడిగిందట; "ఎందుకు మమ్మీ, వాళ్ళలా పదవులు ఊడిన వాళ్ళకన్నా అన్యాయంగా అరుస్తున్నారు ?" అని.

"దేశంలో కరువుగా వుంది బుజ్జీ! వీళ్ళకు తింటానికి అన్నంలేక చస్తున్నారట. అందుకని గంజి కేంద్రాలన్నా పెట్టాలని గోల చేస్తున్నారు!" అందావిడ.

అందుకు విపరీతంగా ఆశ్చర్యపోయిందా బాల. "అదేమిటి మమ్మీ! అన్నందొరకనంత మాత్రాన చావటం ఎందుకు?

ఆపిల్స్ గానీ మిఠాయిలుగానీ తింటూ హాయిగా బ్రతకవచ్చు గదా?" అందట ఆ ముద్దులగుమ్మ.

సదరు చిన్నపిల్లకన్నా అమాయకంగా మాట్లాడగల మహానటులు మనల్నేలుతున్న టోపీదాసులు. మనల్ని నిత్యం వేధించి, బాధించే సకల సమస్యలకూ సదరు మిఠాయి లైపు పరిష్కారాల్ని లడ్డుండల్లా మన గొంతుల్లో కుక్కగల ఘనులు వీరు.

"తింటానికి బియ్యంలేవు మహాప్రభో" అని మొరపెట్టు కుంటే "అందుకేగా గోధుమల్ని జాతీయం చేశాం!" అని దబాయించగలరు! "పోనీ అవే తింటాం. అవెక్కడున్నయో చెప్పండీ సార్!" అంటే "పేపర్లు చదవటం లేదుట్రా! నిన్ననే అమెరికాలో ఓడకెక్కాయి. నువు చచ్చేలోగా మీ ఊరికి వచ్చి తీరతాయి! అని హామీ ఇస్తారు.

"బాబోయ్. అవే. బాబ్బాబు, వచ్చే ఎన్నికల్లో కూడా మీకే ఓట్లేస్తాంగానీ, మా పాపాల్ని క్షమించేయండి సార్. క్రిందటిసారి మా ఊరికి వచ్చిన సదరు అమెరికా పిండి తిని మా వాడొకడు మా ముత్తాతను చూసొస్తానని స్వర్గానికెళ్ళి మళ్ళీ తిరిగి రానేలేదుసార్!" అంటే, "బిగ్గరగా అనకురా సామాన్యుడా! నీకేం భయం లేదులే: నిన్ను స్వర్గానికెళ్ళ నివ్వంలే. ఆ గోధుమల్ని ఉమ్మెత్త గింజల్నుంచి వేరు చేయిం చాకే అమ్ముతాంలే." అని అభయహస్తం చూపగల దయా శీలురు మన టోపీదాసులు.

ఇలాంటి అవతార పురుషులెల్లరికీ ఛీఫ్ అయిన ఢిల్లీ లోని కాంగ్రెస్ అధ్యక్షు బడా టోపీదాస్‌గారు వీరికన్నా పదాకులెక్కువ తిన్న మహాజ్ఞాని. ఆయనగారు అడపాదడపా కొన్ని చరిత్రాత్మక పరిశోధనలు చేస్తుంటారు. తత్ఫలితా లను మహోపన్యాస రూపంలో మన మట్టి బుర్రలకు ట్రాన్స్ఫర్ చేసి మనల్ని చైతన్యవంతులుగా చేస్తూంటారు.

"మన పవిత్ర భారతంలో గల అశాంతికి, అజ్ఞానానికి, దరిద్రానికి కారణము లెవ్వి ?" అని ఆయనగారామధ్య ఓ సభలో మైక్ పగిలేలా ప్రశ్నించేరు.

''తమరింకా బ్రతికుండటమే!" అని ఆ సభలోని ఓ సామా న్యుడు అనబోయేడు గానీ వారం రోజులుగా పస్తులుండటాన వాడి నోరు పెగలలేదుట !

అప్పుడా బడా టోపీదాస్ జీ ''కారణం అమెరికా ! అమెరికా !" అని గర్జించేరుట. అందుకా సభలోని కమ్యూ నిస్టులూ, కాంగ్రెస్ సోషలిస్టు ఫోరంవారూ చప్పట్లు కొట్టే రుట. "ఔరా ! ఇన్నాళ్ళకయినా మనం ఎప్పట్నించో చెబు తూన్న లోడినిజాన్ని గుర్తించేడుగదా మన బాస్ ?'' అని సంతోషించేరుట.

సదరు అధ్యక్ష శర్మాజీ మన ప్రగతిని చూసి అమెరికా అసూయతో కుట్రలు పన్నుతోందని తన పరిశోధనలో కని పెట్టేరుట. అంతర్జాతీయ రంగంలో పెరిగిపోతున్న మనదేశ

ప్రతిష్ఠను చూసి అమెరికాకు పిచ్చెక్కుతూందని కలగన్నారుట. అందుకని దేశంలోని ప్రతిపక్ష పార్టీల్ని మేపుతూ ఇక్కడ అరాచకాన్ని ప్రోత్సహించి మనల్ని అప్రతిష్ట పాల్జేయాలని కుట్రలు పన్నుతోందట అమెరికా.

కనుక మనల్ని జాగ్రత్తగా ఉండమని ఓ ఉచిత సలహా పారేశారు. అంటే, అమెరికా తుమ్మినా, దగ్గినా జాగ్రత్తగా టెలిస్కోప్‌తో కనిపెట్టి ఉండమనీ, అమెరికా బుట్టలోపడి అల్లర్లు చేయొద్దనీ దాని సారాంశం

నిజమే. మన ప్రగతిని చూసుకుని మనమే ఏడుస్తున్న పుణ్యకాలంలో అమెరికా వాడేడవటం ఓ వింత. నిస్సందేహంగా మనం అన్ని రంగాల్లోనూ అమెరికా తలతన్నగల పురోగతిని సాధించేశాం. ఏదో అమెరికావాడు అన్యాయంగా సముద్రంలో పారబోసుకుంటున్నాడు గదా అని దయదలచి వాడి గోధుమల్ని కొంటున్నాం గానీ మనకేం గతిలేకనా? మన ఆహార మంత్రిగారు క్రీ. శ. 2050 కల్లా ఒక్క గింజకూడా దిగుమతి చేసుకోనక్కర్లేదని ఆ మధ్య శెలవివ్వలేదా!

"కరెంటు లేదు, చస్తున్నాం! ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. కార్మికులు బజార్న పడుతున్నారు మహాప్రభో" అంటే మన కేంద్రమంత్రి గారేమన్నారు? ",ఫర్వాలేదు! ఓ బృహత్ప్రణాళిక నా జేబులో రెడీగా వుంది క్రీ. శ. 2000 కల్లా నేషనల్ పవర్ గ్రిడ్ వచ్చేస్తోం దొచ్చేస్తోం దొచ్చేస్తోంది. అంటూ సోషలిస్ట్ యుగళగీతం పాడలేదా!

"దీపాలకి కిరసనాయిలు కూడా లేక మావి చీకటి బ్రతుకులయి పోయాయి ప్రభో!" అని పల్లెటూరి గరీబీలు గోలపెడితే, మన గరీబీ అటావో గౌర్నమెంట్ ఊరుకుందా. "మీరు వాడే కిరసనాయిలు బుడ్లు మాంధాతల కాలపువి. తక్కువ నూనెతో ఎక్కువ మండే కొత్త దీపాలు డిజైన్ చేయించబోతున్నాం." అని తతుణం మన టోపీదాసుల బొమ్మరుదులతో ఓ కమిటీని వేయలేదా!

"వర్షాల్లేవు! పొలాలకు నీళ్ళులేవు!" అంటూ కొందరు రైతు సంఘీయులు అల్లరి పెడుతుంటారుగానీ మనం మోస పోగూడదు. దేశాని కామూలనున్న గంగను ఈ మూలనున్న కావేరితో కలిపే ప్రపంచాద్భుత కాలువ నోదాన్ని మనముని మనవళ్ళ కాలానికల్లా రెడీ చేసేయ్యబోతున్నారు ఘనమైన మన ఏలినవారు.

మనది దూరదృష్టి, దీర్ఘకాలిక విప్లవమూనూ. దేనికీ తొందరపడగూడదు. పాతికేళ్ళుగా ఈ కొన ఊపిరిని నిలబెట్ట గలిగినవాళ్ళం ఆ మాత్రం ఆగలేమా? 'నిదానమే ప్రధానము' అనిగదా మన వేదాలు చెపుతున్నదీ మన సోషలిస్టుదెయ్యాలు వల్లిస్తున్నదీ కూడా.

మనది అసలు సిసలు సోషలిస్టు ప్రజాస్వామ్యం. 'వాటర్ గేట్' కుట్రల అద్భుత కథలుచెప్పి అమెరికా వాళ్లేం కాల రైగరేసుకో నక్కరలేదు. మన మామాత్రం చేతగాని వాళ్ళమేం కాము. విదేశీ ఏజంట్లయిన మన ప్రతిపక్ష నాయ

కుల సంగతలా వుంచి- స్వచ్ఛమైన స్వదేశీ ఏజంట్లయిన మన సుప్రీంకోర్టు జడ్జీలే తమ టెలిఫోన్లను సిఐడిలు చాటుగా వింటున్నారని వారి ప్రజ్ఞకు మెచ్చుకుంటూ సర్టిఫికేట్లివ్వలేదా ?

నిక్సన్‌కు ప్రజాస్వామ్యం తెలీదు గనుక ఇంకా రాజీనామా ఇవ్వలేదుగానీ మన మైసూర్ మంత్రిగారు ఆడపిల్ల వ్యవహారంలో పాడిఆవు లాంటి పదవికి రాజీనామా పారేసి హాయిగా పిండిమిల్లుల్ని మేనేజ్ చేసుకుంటూ కాలక్షేపం ఆరంభించలేదా?

మనమేదో అప్పులు తెచ్చుకుని పప్పుకూడుగా కాలక్షేపం చేస్తున్నామని గిట్టని వాళ్ళంటారుగానీ నమ్మగూడదు. మొన్నే గదా, కెనడానుంచో కాంగోనుంచో 60 కోట్లు తెచ్చాం ! ఎందుకు? దానికి మరో పదికోట్లు కలిపి బంగ్లాదేశ్‌కు అప్పిచ్చేందుకే గదా ! పరోపకారార్థమిదం అప్పుల్ గదా ! మన తప్పెక్కడుంది.

ఇదంతా చూస్తుంటే వళ్ళు కిరసనాయిల్లేకుండానే మండుతోందంటారా! మంచిది! అది ఆరోగ్యకరమే. మరి మీ పొరుగింటాయనక్కూడా మండుతోందేమో కనుక్కోండి.

వెధవ గొడవలు మనకెందు కంటారా ! అది మరీ మంచిది. శుభ్రంగా అన్నం సంగతి మరచిపోయి ఆపిల్సుతో లడ్డుండల్తో బ్రతికేయండి.

(జులై 1973)